


# నవభూమి

## మెదక్

అనుబంధం

12 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:5

www.epaper.navabhoomi.in

### గంజాయి అక్రమ

# రవాణాపై ఉక్కుపాదం



**కోహీర్-నవభూమి :** గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పీఎస్ ఆవరణం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి స్వాధీనం వివరాలను ఆయన వెల్లడించారు. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డితో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి మాడ్గి గ్రామ శివారులోని ఆనంద్‌దాబా వద్ద 65వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారన్నారు. కర్ణాటకలోని బాల్కికి చెం దిన లఖన్, సిద్దిరామ్ కలిసి హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న క్రమంలో బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారని చెప్పారు. అందులో 140కిలోల ఎండు గంజాయిని ముంబయి, పూణెకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారని వెల్లడించారు. గంజాయి విలువ రూ.35లక్షల వరకు ఉం టుందని, వాహనంతోపాటు లఖన్, సిద్దిరామ్‌ను అరెస్ట్ చేశామన్నారు. అక్రమ రవాణాకు సహకరించిన మల్గొండ, రాహుల్,కిరణ్, సునిల్, మల్లేశ్‌నాయక్ పరారీలో ఉన్నారని తెలిపారు. 140కిలోల గంజాయితోపాటు బొలెరో, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్ కార్డులను సిజ్ చేశామన్నారు. సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, పలు విభాగాల ఎస్సైలు రమేశ్, విజయ్, మహేశ్, శ్రీకాంత్, రాజేందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# విచారణలో బయటకు వస్తున్న అక్రమాలు



**సిద్ధిపేట-నవభూమి :** సహకార సంఘాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకుం టున్నాయి. ఇటీవల పలు సొసైటీల్లో చోటు చేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం పంట రుణమాఫీ మూడు విడతల్లో చేయడంతో అసలు గుట్టు రట్టవుతున్నది. రైతులకు తెల్వకుండానే సొసైటీ అధికారులు పంట రుణాలు తీసుకొని సొంతానికి వాడుకున్నారు. రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వచ్చే సరికి అసలు విషయం ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గన్నీబ్యాగులు, పంట రుణాల పంపిణీ, లాంగ్ టర్మ్ రుణాలలోనూ సొసైటీ అధికారులు నిబంధనలకు పాతర వేసి ఇష్టానుసారంగా వ్యవహరించి భారీగా అవినీతికి పాల్పడినట్లు అర్థమవుతున్నది. సహకారమా..? స్వాహా పర్వ మా..? అన్న తరహాలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని సొసైటీలు తయారయ్యాయి. ఇంత జరుగుతున్నా సంబంధితశాఖ అధికారుల చర్యలు మాత్రం శూన్యం. ప్రతి సొసై టీ అక్రమాల వెనుక జిల్లా స్థాయి అధికారులతో పాటు ఇతర పెద్దల హస్తం ఉండడంతో "ఆడింది ఆట పాడిం ది పాట" అన్నట్లుగా తయారైంది. సిద్దిపేట, మెదక్, సం గారెడ్డి జిల్లాల్లోని ప్రతి సహకార సంఘాన్ని పూర్తి స్థాయి లో విచారణ చేస్తే ఆయా సొసైటీల స్కాంలు బయట పడనున్నాయి. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకొని సొసైటీలపై విచారణ చేపట్టాలని ఆయా సొసైటీల పరిధిలోని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సొసైటీల్లో జరుగుతున్న అవినీతి రోజుకొకటి బయటకు వస్తున్నాయి. ఆయా సొసైటీల సెక్రటరీలు, ఇతర సిబ్బంది కలిసి సొసైటీలను పూర్తిగా అవినీతిమయం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో మెదక్ జిల్లాలోని పలు సొసైటీలు, సంగారెడ్డి జిల్లాలోని రెండు, మూడు సొసైటీలు, సిద్దిపేట జిల్లాలోని మూడు నాలుగు సొసైటీల్లో భారీగా అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో సహకార శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆయా సొసైటీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపడుతున్నది. ఈ విచారణలో పలు ఆసక్తికర విషయా లు బయటకు వస్తున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) సహకారశాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్నది. డీసీసీబీ పరిధిలోని బ్రాంచీలతో పాటు సహకార శాఖ పర్యవేక్షణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) భారీగా రుణాల గోల్‌మాల్ జరిగింది. సంగారెడ్డి జిల్లాలో 37 సొసైటీల్లో 22,086 మంది రైతులు రూ.212.46 కోట్ల పంట రుణాలు, మెదక్ జిల్లాలో 31 సొసైటీల్లో 29,519 మంది రైతు లు రూ.153.76 కోట్ల పంట రుణాలు, సిద్దిపేట జిల్లా లో 15 సొసైటీల్లో 11,980 మంది రైతులు 85.17 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు.

# ముత్తంగిలో నీటి ఎద్దడి



**పటాన్‌చెరు-నవభూమి :** సంగారెడ్డి జిల్లా ముత్తంగి గ్రామ పంచాయతీ పరిధిలో పదిహేను రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. పటాన్‌చెరు మండలం ముత్తంగితో పాటు మరో నాలుగు గ్రామాలను ఓఆర్ఆర్ పరిధిలో ఉన్నాయని, ఈ నెల 3న సమీప తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత పంచాయతీల్లో సేవలు నిలిచిపోయాయి. అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ముత్తంగి గ్రామంలోని పలు కాలనీలకు గత నెల చివరి వారంలో తాగునీటిని వదిలారు. ఆ తర్వాత తాగునీరు సరఫరా నిలిచిపోయింది. సెప్టెంబర్‌లో ఒక్క రోజు కూడా మిషన్ భగీరథ నీరు సరఫరా కాలేదు. దాదాపు 25వేల జనాభా ఈ గ్రామ పరిధిలో నివసిస్తున్నారు. ముత్తంగి గ్రామానికి, దత్తాత్రేయ కాలనీకి ఒక్కో కనెక్షన్‌ను మిషన్ భగీరథ గ్రిడ్‌నుంచి ఇచ్చారు. దత్తాత్రేయనగర్ కాలనీ ద్వారా పలు కాలనీలకు సరఫరా అయ్యే నీరు ఆగిపోయింది. ప్రజలు పంచాయతీ సిబ్బందిని అడిగితే గ్రిడ్ నుంచి నీరు రావడం లేదని చెబుతున్నారు. గ్రిడ్ అధికారులను అడిగితే తాము రెగ్యులర్‌గా నీటిని సరఫరా చేస్తున్నామని సెలవిస్తున్నారు. ఈ విషయంపై విచారిస్తే ముత్తంగి గ్రామ పరిధిలోని పలుకాలనీల్లోని పైప్‌లైన్లలో సమస్యలు ఉన్నట్లు తేలింది. మిషన్ భగీరత ద్వారా కాలనీలకు వేసిన పైప్‌లైన్లను ప్రైవేట్ వ్యక్తులు, పంచాయతీ సిబ్బంది ఇష్టానుసారంగా తవ్వడంతో అనేక చోట్ల మరమ్మతులు వస్తున్నాయి. ముత్తంగి పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం ప్రజల పాలిట శాపంగా మారింది.

**రెండు రోజుల్లో సరిదిద్దుతా**

ముత్తంగిలోని కొన్ని కాలనీలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం వాస్తవమే. వరద కారణంగా పైప్‌లైన్లు ధ్వంసమయ్యాయి. రెండు రోజుల్లో వాటికి మరమ్మతు చేసి తాగునీటిని అందజేస్తాం. గ్రిడ్ నుంచి కూడా తాగునీరు సరిపోను రావడం లేదు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తా.

# జీహెచ్ఎంసీ ఎదుట కార్మికుల ధర్నా



## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**బెజ్జంకి-నవభూమి :** ఇంటర్ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఐఈఓ రవీందర్ రెడ్డి భోధన సిబ్బందికి సూచించారు.బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ రవీందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులను పరిశీలించారు.పలు రికార్డులను తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు.రానున్న ఇంటర్ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేల భోధన సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.ప్రిన్సిపాల్ దేవ స్వామి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి,అధ్యాపకులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు..



**బెజ్జంకి-నవభూమి :**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియామకమైన మహేష్ కుమార్ గౌడ్ ను బుధవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వాటర్స్ యందు మండల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అక్కిరవేణి పోచయ్య,టీపీసీసీ నాయకుడు రాసూరి మల్లికార్జున్,మానకొండూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి చిన్నారెడ్డి మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి సన్మానించారు.

## ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తి

**తొగుట- నవభూమి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి దొరల పెత్తనన్ని ప్రశ్నించి పోరాడిన ఘనత చిట్యాల చాకలి ఐలమ్మ ది అని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ అన్నారు. మంగళవారం చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతి గుడికందుల గ్రామంలో ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పటిమ చూపిన స్ఫూర్తి భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు. జిల్లాలో ప్రతి గ్రామం లో ఐలమ్మ విగ్ర హం ఏర్పాటు చేసే విధంగా రజక సంఘంల నాయ కులు ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. మన హక్కుల సాధన కోసం ఆ దిశగా అడుగులు వేయాలని దేశ చరిత్రలోనే మహోన్నత స్థానం సంపాదించిన వీర వనిత మన తల్లి ఐలమ్మ అని కొనియాడారు. 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహి స్తున్న రాష్ట్ర రజక కుల సమాజానికీ ప్రత్యేక ధన్య వాదాలు తెలుపుకుంటు నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు చైతన్యవంతులై మన హక్కులకై అన్ని రకాలుగా ఉద్యమాలు చేయడం వాటి దిశగా అడుగులు ముందుకు వేయడం మన ముందున్న లక్ష్యం అని అన్నారు.



# 38 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

**చేవెళ్ల-నవభూమి :** శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఎత్తున రేషన్ బియ్యం, గోధుమలు పట్టుబడ్డాయి. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తెలిపిన కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ గ్రామ పంచాయతీ పరిధి ఇంద్రారెడ్డి నగర్‌లో రేషన్ బియ్యం అక్రమంగా డంప్ చేశారన్న విశ్వసనీయ సమాచారంతో మంగళవారం తెల్లవారు జామున సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఓ బర్రెల షెడ్డులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం, గోధుమల డంపును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే లోడ్ చేసిన ఓ లారీని సీజ్ చేసి మోకిల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. షెడ్డులో ఉన్న బియ్యం, గోధుమలను లారీలో నింపి చేవెళ్లలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. ఈ సందర్భంగా డీటీ రఘునందన్ మాట్లాడుతూ నగర శివార్ల నుంచి రేషన్ బియ్యాన్ని తకువ ధరకు సేకరించి.. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశామన్నారు. మొత్తం 38 టన్నుల 300 కిలోల పీడీఎస్ రైస్, 11టన్నుల 250 కిలోల గోధుమలను స్వాధీనం చేసుకొని కేసు ఫైల్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన లారీ డ్రైవర్లను విచారించగా.. మహ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి పేరు చెబుతున్నారని, విచారణలో పూర్తి విషయాలు తెలుస్తాయన్నారు. నగర



శివార్లలో నిర్మానుష్య ప్రాంతాలను అక్రమారులు ఎంచుకుని పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు సమాచారం ఉన్నదని, దీనిపై దాడులు నిర్వహిస్తామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పౌర సరఫరాల శాఖ డీటీ రవీందర్ నాయక్, రాష్ట్ర విజిలెన్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత చేప ఉన్నట్లా ? లేనట్లా ?

**రంగారెడ్డి-నవభూమి :** వానొచ్చింది.. వరదొచ్చింది.. చెరువుల్లోకి నీరొచ్చింది. కానీ..ఉచిత చేప పిల్లల జాడే లేదు. మళ్లీ మళ్లీ టెండర్లు పిలిచి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీ ఉన్నట్లా..? లేనట్లా..? అన్న అనుమానాలను మత్స్య కారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినా.. చేప లను చెరువుల్లో వదిలేసరికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుంది. అప్పట్లోగా వానకాలం ముగుస్తుంది. ఇక చేపలు ఎదిగేందుకు అవసరమైన నీళ్లూ ఉండకపోవచ్చు. టెండర్లతో ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న 9,136 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి విషయంలో ఆందోళన చెందుతున్నాయి.మిషన్ కాకతీయ పథకంతో చెరువులను అభివృద్ధి చేసిన కేసీఆర్ ప్రభుత్వం మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టింది. అం దులో భాగంగానే ఏడాది పొడవునా వారికి జీవనోపాధి కల్పించి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. 2016-17లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ..గడిచిన ఏడేండ్లలో 6.63 కోట్ల చేప పిల్లలను ఉచితంగా అందజేసింది. ఇందుకోసం రూ.4.40 కోట్ల వరకు ఖర్చు చేయగా.. 41,753 మెట్రి క్ టన్నుల చేపల ఉత్పత్తితో రూ.56.59 కోట్ల ఆదాయం సమకూరింది. జలాశయాల్లో ఉచితంగా వదిలిన బొచ్చ, రాహు, బంగారు తీగ, రొయ్య, ముల్లంగి తదితర చేపలతో మత్స్యకారులు ఏడాది పొడవునా ఉపాధిని పొందారు. చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. చేప పిల్లలను వేటాడేందుకు వలలు, రవాణా కోసం ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు, బొలెరో వాహనాలను అందజేసింది. అలాగే మహిళా సహకార సంఘాలకు విరివిగా రుణాలను మంజూరు చేయడంతో పాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకున్నది. గత ప్రభుత్వం కల్పించిన భరోసాతో మత్స్యకారుల జీవితాల్లో పెనుమార్పులొచ్చాయి. ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి.

**ఆనాటి పండుగ సందడేదీ..**

జిల్లావ్యాప్తంగా 120 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 978 చెరువులున్నాయి. వీటి పరిధిల్లో 186 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా..అందులో 9,136 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేవారు. కానీ..ఈసారి ఆ సందడి ఎక్కడా లేకుండా పోయింది. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు టెం డర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఇన్ టైంలో చేప పిల్లలను పంపిణీ చేస్తారా? లేదా..? అన్న దానిపై అధికార వర్గాల నుంచీ స్పష్టత లేదు. గతంలో ప్రతి ఏటా చేప పిల్లల పంపిణీని జూలైలోనే పూర్తి చేసేవారు. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ఆగస్టు మొదటి వారంలో ఈ తంతు పూర్తి అయ్యేది. ఇందుకోసం ప్రభుత్వం ఏప్రిల్ నుంచే సన్నాహాలు మొదలు పెట్టేది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో పెంచేందుకు 80 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు చేప పిల్లలను.. చెరువులు, కుంటల్లో పెంచేందు కు 35ఎంఎం నుంచి 400ఎంఎం సైజులో ఉండే చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసేది. అయితే ఈసారి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**గతేడాది బిల్లులు చెల్లించక పోవడంతోనే..!**

ఈ ఏడాది జిల్లాలోని 813 చెరువుల్లో కోటీ93 లక్షల చేప పిల్లలను వదలాలని జిల్లా మత్స్యశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ మేరకు అధికారులు గత జూలై 10న టెండర్లు పిలిచినా ఒక్కరూ బిడ్ దాఖలు చేయలేదు. చివరి తేదీని 23 కు పొడిగించినా ఫలితంలేదు. దీంతో గడువును ఆగస్టు 13కు పెంచి ముచ్చటగా మూడోసారి టెండర్లు పిలిచినా గుత్తేదార్ల నుంచి స్పందన రాలేదు. నాలుగోసారి టెండర్లు పిలిచిన ప్రభుత్వం బిడ్ దాఖలుకు ఈనెల 19 వరకు గడువు ఇచ్చింది. సెప్టెంబర్ నెల వచ్చినా ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో మత్స్యకారుల్లో ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి కొంతమేర వరద చేరింది. చేప పిల్లలు విడుదలకు ఇదే అనువైన సమ యం. అయితే ఆలస్యంగా చేప పిల్లలను వదలడంవల్ల చేపలు ఎదిగేందుకు ఆలస్యమై మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. అయితే టెండర్లు దాఖలు కాకపోవడానికి పెండింగ్ బిల్లులే కారణమని తెలుస్తున్నది. గతేడాది వదిలిన చేప పిల్లలకు సంబంధించిన బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం ఇంకా గుత్తేదార్లకు చెల్లించలేదు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే.. టెండర్‌లో పాల్గొంటామని గుత్తేదార్లు స్పష్టం చేయడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. ఈసారి కూడా బిడ్ దాఖలు చేయకపోతే ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో..! అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

**ఈ ఏడాది జీవనోపాధి ఎట్లా..**

మత్స్యకార కుటుంబాలు చాలావరకు చేపల వృత్తినే నమ్ముకుని బతుకుతున్నాయి. ఈసారి ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టకపోవడంతో జీవనోపాధి ఎట్లా..? అని వారు మదనపడుతున్నారు. గతంలో సెప్టెంబర్ నాటికే పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లతో కాలయాపన చేయ డం తగదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి చెరువుల్లో చేపపిల్లలను వదలడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఉపాధిని చూపాలి.



## అంగన్వాడీ పౌష్టికాహారాన్ని అందరూ తీసుకోవాలి



**బెజ్జంకి-నవభూమి :** అంగన్వాడీ కేంద్రాలు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగారాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గూడెం అంగన్వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు కవ్వంపల్లి సరోజన అధ్వర్యంలో పోషణ మాసం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలతో నాగారాణి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు.పంచాయితీ కార్యదర్శి లావణ్య,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ రెడ్డి,మహిళలు హాజరయ్యారు.

## హుస్నాబాద్ లో నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు



**హుస్నాబాద్-నవభూమి :** నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి ఆద్వర్యంలో 100 ఫిట్ల రోడ్డు పనులలో భాగంగా ఇండ్లను కూల్చారు. హుస్నాబాద్ పట్టణంలోని అర్ టి సి క్రాస్ రోడ్డు నుండి హన్మకొండ రోడ్డులో కూల్చివేత పనులు వేగవంతం చేశారు. ఇండ్లను కూల్చవద్దని ఇంటి యజమానులు జె సి బి కి అడ్డం వచ్చిన పోలీస్ లు ఏలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. ఇంటి యజమానులకు రోడ్డుకు వచ్చే ఇండ్లను తొలగించాలని చెప్పిన తొలగించలేదని ,అందుకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇంటి యజమానులు ఎన్ని చెప్పిన కూల్చివేత పనులు నిలిపివేయలేదు. పనులను వేగవంతం చేసి రోడ్డు పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. అవకాశం ఇస్తే మేమే తొలగించుకుంటాం%ా%  బతుకమ్మ, దసరా పండుగలు ఉన్న నేపథ్యంలో అవకాశం ఇస్తే స్వతహాగా మేమే సెట్ బ్యాక్ అవుతామని వ్యాపారస్తులు కోరుతున్నారు. కూల్చివేతల కారణంగా వ్యాపారం చేసుకునే మాకు ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఐఐహెచ్‌టీ గాయబ్..!

**భూదాన్-నవభూమి** : భూదాన్ పోచంపల్లి నేతన్నల ఆశలు, ఆకాంక్షలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. భూదాన్ పోచంపల్లి మాత్రమే కాదు.. యాదాద్రి భువనగిరి జిల్లా నేత కార్మికుల నోట్లో మట్టి కొట్టింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని తరలించుకుపోయింది. కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారాన్ని నిజం చేసింది. వచ్చే ఏడాది నుంచి స్కిల్ యూనివర్సిటీలో ప్రారంభిస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో భూదాన్ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నో ఏండ్ల పోరాటాలు, ఆందోళనలు, వినతిపత్రాలతో సాధించుకున్న సంస్థను గద్దలా ఎగరేసుకుని పోయారు.రాష్ట్రంలో నలభై వేల చేనేత కుటుంబాలు ఉండగా, అత్యధికంగా భూదాన్ పోచంపల్లిలోనే నేత కార్మికులు ఉన్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులను నమ్ముకొని మగ్గాలపై చీరలు, చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. ప్రస్తుతం ఐఐహెచ్‌టీల్లో కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. తెలంగాణలో ఐఐహెచ్‌టీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



# జీహెచ్ఎంసీ ఎదుట కార్మికుల ధర్నా



**సిటీబ్యూరో-నవభూమి :** గ్రేటర్‌లో భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి డంప్ చేస్తున్న వాహనాల నుంచి రాంకీ ఏజెన్సీ వసూలు చేస్తున్న అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. నూతన భవనాల నిర్మాణం, పాత నిర్మాణాలను కూలగొట్టినప్పుడు వస్తున్న బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ (మట్టి)ని సేకరించి తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లు సుమారు 200 వరకు ఉన్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు.జీహెచ్ఎంసీ సూచించిన స్థలా ల్లో డంప్ చేస్తున్నామని, మొదట్లో ఒక వాహనం నుంచి బల్దియా రూ. 100 వసూలు చేసిందని, జీహెచ్ఎంసీతో రాంకీ ఒప్పందం జరిగిన తర్వాత రూ. 350 పెంచారని చెప్పారు. రాంకీ సంస్థ అకస్మాత్తుగా ఈ నెల 1 నుంచి వా హనం లెక్క కాకుండా టన్నుకు రూ. 409 నిర్ణయం తీసుకున్నదని, ఒక వాహనంలో మూడు టన్నుల మట్టి పడుతుందన్నారు. రాంకీ చేసిన ఈ నిర్ణయంతో ఒక ట్రిప్పుకు రూ. 1,227 చెల్లించాల్సి వస్తున్నదన్నారు.ఒక వాహనం పై ఓనర్ కం డ్రైవర్, ముగ్గురు లేబర్ జీవనోపాధి పొందుతున్నారని, రాంకీ నిర్ణయంతో కార్మికుల భవిష్యత్ అంధకారంలో పడిందన్నారు. రాంకీ సంస్థ వసూలు చేస్తున్న అదనపు చార్జీలను రద్దు చే యాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, రాములు, మహేందర్, సోమయ్య, బాలయ్య , రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో

# అన్నదాతల అవస్థలు

**రంగారెడ్డి-నవభూమి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్ప టి నుంచి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ప్రభుత్వం ఇంకా రైతుబంధు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకపోవడం.. బ్యాంకులు అన్నదాతలకు రుణాలు మంజూరు చేయకపోవడంతో మళ్లీ వడ్డీ వ్యాపారులు, ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి రైతులకు వచ్చింది.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అవస్థలు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పుల కోసం ఎప్పుడూ చూడని అన్నదాతలు.. ప్రస్తుత ప్రభుత్వంలో పంటల సాగుకు మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కేసీఆర్ ప్రభుత్వంలో సీజన్ ప్రారంభానికి ముందే విత్తనాలు, ఎరువులను కొనేందుకు రైతుబంధు సాయాన్ని అందజేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖరీఫ్ సీజన్ దాటుతున్నా సాయం అందక అష్టకష్టాలు పడుతున్నారు.కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకూ ప్రారంభించలేదు. గతేడాది యాసంగిలో రైతుబంధు సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో నాలుగు ఎకరాలు గల రైతులకు మాత్రమే పంపిణీ చేసింది. జిల్లాలో 2,95,796 మంది అర్హులైన రైతులుండగా 2,00,567 రైతులకే సాయం అందింది. మరో 95,000 మందికి పంపిణీ చేయలేదు.కాగా అధికారంలోకి రాగానే రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తామని ప్రగల్భాలు పలికిన అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. గద్దెనెక్కిన తర్వా త ఆ విషయాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. కేసీఆర్ ప్రభుత్వం అన్నదాతల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేలా.. రైతును రాజుగా చేసే సదుద్దేశంతో రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టింది.ఈ పథకం అమల్లోకి రావడంతో వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల వద్ద పంట రుణాలు తీసుకునే రైతుల సంఖ్య సగానికిపైగా తగ్గిపోయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతల కష్టా లు మళ్లీ మొదటికొచ్చాయి. ఓ వైపు పెట్టుబడి సాయం అందక.. బ్యాంకర్లు పంట రుణాలను మంజూరు చేయకపోవడంతో అన్నదాతలు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది.

**భరోసాపై ప్రస్తావనే లేదు..**

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకంతో అన్నదాతలను అప్పుల బారి నుంచి ఆదుకున్నది. ప్రతి ఏటా ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించడంతో పంట రుణాల కోసం బ్యాంకులు, ఇతర ప్రైవే ట్ వ్యక్తుల వద్దకు రైతులు వెళ్లలేదు. ఈ పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2,622 కోట్ల సాయాన్ని జిల్లాలోని అన్నదాతలకు పెట్టుబడి నిమిత్తం అందజేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పెట్టుబడి సాయానికి బ్రేక్ పడడంతో రైతులు మళ్లీ అప్పుల బారిన పడుతున్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయా న్ని అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. గత యాసంగిలో కొంతమందికే రైతుబంధు సాయాన్ని జమ చేసిన ప్రభుత్వం వానకాలం ముగుస్తున్నా ఇప్పటివరకు సాయం అందించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో అన్నదాతలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.



**రైతులకు అరకొర రుణాలే..**

ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు బ్యాంకర్లు అరకొర రుణాలనే మం జూరు చేశారు. ఓ వైపు రైతులకు పంట రుణాలను మంజూరు చేయ డంలో నిర్లక్ష్యం చేస్తుండడంతోపాటు ఈ ఖరీఫ్‌లో ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యం (రూ.1800 కోట్ల)లో 44 శాతం రుణాలనే మంజూరు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రూ. 3,434 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు రూ.800 కోట్ల రుణాలను మాత్రమే బ్యాంకర్లు రైతులకు ఇచ్చారు.అర్హుల్లో కొంతమందికే ప్రభుత్వం రుణమాఫీని వర్తింపజేయగా.. మాఫీ అయిన రైతుల పంట రుణాలను రెన్యువల్ చేయడంలోనూ బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రుణమాఫీ అయిన రైతుల రుణాలను రెన్యువల్ చేస్తేనే కొత్త రుణాల మంజూరుకు అవకాశం ఉంటుంది. దీంతో రుణమాఫీ అయిన రైతు లు గత నెల రోజులుగా రుణాల రెన్యువల్ కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు.ఉద యం 8 నుంచి సాయంత్రం 5 గంటల వర కు బ్యాంకుల వద్ద పడిగాపులు గాస్తున్నారు. కొం తమంది అన్నదాతలు ప్రతిఏటా తమ పంట రుణాలను రెన్యువల్ చేసుకున్నా కొన్ని బ్యాంకులు వాటిని అప్‌డేట్ చేయకపోవడంతో సంబంధిత రైతులకు రుణమాఫీ కాకపోవడంతోపాటు రెన్యువల్ సమస్యా వేధిస్తున్నది. ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా రైతులకు పంట రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకర్లు తీవ్ర జాప్యం చేస్తుండడం గమనార్హం.

**రైతన్నకు కష్టాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రైతన్నలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల హామీలను తుంగలో తొక్కింది. ప్రతి ఏటా ఎకరానికి రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. దీంతో పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎరువులు, విత్తనాలను కొనేందుకు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయాన్ని వెంటనే పంపిణీ చేయాలి.

## గురుకులాల్లో ఎస్సి విద్యార్థులకు 12 న స్పాట్ అడ్మిషన్లు

**చేర్యాల- నవభూమి :**సిద్దిపేట జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5 నుంచి తొమ్మిదో తరగతులలో మిగిలి పోయిన ఎస్సీ బాల బాలికల సీట్లకు ఈ నెల 12 న(గురువారం) మిట్టపల్లి లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి బి.అశోక్ బాబు తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం అశోక్ బాబు విలేకరులతో మాట్లాడుతూ అర్హతలు ప్రవేశాలకు నిర్వహించినటువంటి అర్హత పరీక్ష రాసి సీటు పొంది గురుకులం లో చేరని వారు, పరీక్ష రాసినటువంటి ఎస్సీ విద్యార్థులు, ఆర్ఫన్, సెమిఆర్ఫన్ విద్యార్థులు, ఎస్సీ దివ్యాంగులు వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉన్నవారు అర్హులని, అర్హత కలిగిన ఎస్సీ క్యాటగిరీకి చెందిన విద్యార్థులు 12 న ఉదయం 10 గంటలకు హాల్ టికెట్, అర్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

## సాయుధ రైతాంగ పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తి



**రంగారెడ్డి-నవభూమి :** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ శశాంక ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించి 2022 సెప్టెంబర్ 22న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మాటల్ని తూటాలుగా మల్చుకొని పేదల పక్షాన నిలిచి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్ ముఖ్, రజాకర్ల అరాచకాలపై వీరోచిత పోరాటం చేసి ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఎ.ఆంజనేయులు, జిల్లా రజక సంఘం ప్రెసిడెంట్ ఎం. అజయ్, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 20 మండలాల్లో అధిక వర్షపాతం

**సూర్యాపేట-నవభూమి :** సూర్యాపేట జిల్లాలో భారీగా వర్షపాతం నమోదవుతున్నది. సెప్టెంబర్‌లో తొమ్మి రోజులు జిల్లాలో అత్యధిక వర్షాలు కురిశాయి. 38.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 648 శాతం అధికంగా నమోదైంది. 291.1 మిల్లీమీటర్ల సగటు వర్ష వర్షపాతం కురిసింది.జిల్లాలో 20 మండలాల్లో అధిక వర్షపాతం, తిరుమలగిరి, నేరేడుచర్ల మండలాల్లో సాధారణ, పాలకవీడు మండలం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు గుర్తించారు. జూన్ నుంచి వర్షాలు ప్రారంభం కాగా ఆ నెలలో 52 శాతం వర్షాలు కురిశాయి. కానీ జూలై, ఆగస్టులో లోటు వర్షపాతం నమోదు కావడంతో వేసవిని తలపించే ఎండలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లో కురుస్తున్న వర్షాలతో జిల్లా తడిసి ముద్దవుతున్నది.



# కబ్జాపై కదిలిన యంత్రాంగం

**ఆదిబట్ల-నవభూమి :** ఓ రియల్ ఎస్టేట్ సంస్థ జిలాన్‌ఖాన్ చెరువును మట్టితో పూడ్చి నిర్మాణాలు చేపట్టేం దుకు సన్నాహాలు చేస్తున్నట్లు సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో వార్త ప్రచురితం కాగానే ఆదిబట్ల మున్సిపల్ అధికారులు స్పందించారు. టీపీవో హబీబున్నీసా తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన జిలాన్‌ఖాన్ చెరువుకు వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయించారు.అక్కడ నిర్మాణాలకు ఎలాంటి అనుమ తుల్లేవని.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరూ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే సమయంలో ఇరిగేషన్ అధికారుల వైఖరి మరో రకంగా ఉన్నది. ఆ శాఖలో అన్నీ తానై వ్యవహరించే ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నిర్మాణాలు చేపడుతున్న స్థలాన్ని పరిశీలించి, అసలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాల్లేవని, నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశం ఎఫ్‌టీఎల్ పరిధిలో లేనే లేదంటూ బుకాయించాడు.అయితే హెచ్‌ఎండీఏ అధికారులు 2017లోనే జిలాన్‌ఖాన్ చెరువును సర్వే చేసి మ్యాపింగ్ చేశారు. అప్పట్లో చెరువు సర్వేనంబర్ 122, 123, 125లో ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం 24ఎకరా ల 32 గుంటలు ఉన్నట్లు తేల్చా రు. కాగా, సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మాత్రం హెచ్‌ఎండీఏ అధికారుల మ్యా పింగ్ తప్పని, అసలు చెరువు కబ్జానే కాలేదంటూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతుండడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.పట్నం ఇరిగేషన్ శాఖను శాసిస్తున్న ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి..ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ శాఖలో ఓ అవుట్ సోర్సింగ్



ఉద్యోగి చెప్పిందే వేదంలా మారింది. ఎక్కడైనా చెరువులు, కుంటలు కబ్జా అవుతు న్నా.. తాను కబ్జా కాలేదని రిపోర్టు ఇస్తే అదే ఫైనల్.. ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ శాఖలో వేల కు వేలు వేతనాలుగా తీసుకుని పనిచేస్తున్న ఇరిగేషన్ డీఈలు, ఏఈలు ఉన్నా లేనట్టే.. వారు ఏ ఒక్క రోజు కూడా చెరువులు, కుంటలను పర్యవేక్షించిన పాపానపోలేదని విమర్శలున్నాయి. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతుంటే.. సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

### మోసాలకు పాల్పడుతున్న

# 13 మంది ముఠా సభ్యుల అరెస్టు

**సిటీబ్యూరో-నవభూమి :** యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించి.. తప్పు డు పేమెంట్ జరిగిందంటూ.. బ్యాంకులకు ఫిర్యాదు చేసి..డబ్బులను తిరిగి తమ ఖాతాల్లోకి రప్పించుకుంటూ%ెూ%మోసం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన 13 సభ్యులు గల ముఠాను సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశా రు. నిందితుల నుంచి రూ.1.72 లక్షల నగ దు, రూ.50 లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో క్రైమ్ డీసీపీ నర్సింహ వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సోమ్‌రాజ్, సునీ ల్, లక్‌రామ్, శర్వాన్, సోమ్‌రాజ్, శివ్‌లాల్, రమేశ్, శ్రావణ్, రాకేశ్, రమేశ్, అశోక్ కుమార్ యూపీఐ చెల్లింపులతో ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసి, తరువాత తప్పు డు చెల్లింపులు జరిగినట్లు బ్యాంకులకు ఫిర్యా దు చేసి.. యూపీఐ ద్వారా చెల్లించిన డబ్బుల ను తిరిగి తమ ఖాతాల్లోకి వెనక్కి రప్పించుకుంటున్నారు.ఈ విధంగా నగరంలోని ట్రై కమిషనరేట్ల పరిధిలోనే సుమారు రూ.4కోట్ల మోసాలకు పాల్పడ్డారు. రాజస్థాన్‌కు చెందిన ఈ ముఠా సభ్యుల్లో కొంతమంది హైదరాబాద్‌లో తిష్ట వేయగా, మరికొందరు రాజస్థాన్ నుంచి చక్రం తిప్పుతారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉన్న ముఠా సభ్యులు నగరంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షో రూమ్‌లను సందర్శిం చి, అక్కడ ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తారు.ఇందులో భాగంగా షో రూంలో చెల్లింపులకు సంబంధించి స్కానర్ ను ఫొటో తీసి రాజస్థాన్‌లో ఉన్న తమ ముఠా సభ్యులకు పంపుతారు. దీంతో రాజస్థాన్‌లో ఉన్న మిగిలిన ముఠా సభ్యులు తమ సహచరులు పంపిన బజాజ్ ఎలక్ట్రానిక్స్ స్కానర్‌కు యూపీఐ ద్వారా డబ్బులు చెల్లిస్తారు. అనంతరం ఎలక్ట్రానిక్ పరికరాలు డెలివరీ అయిన వెంటనే ముఠా సభ్యులు వాటిని ఇతరులకు విక్రయిస్తారు.అదే సమయంలో



రాజస్థాన్‌లో ఉన్న గ్యాంగ్ తమ ఖాతా నుంచి తప్పుడు చెల్లింపులు జరిగినట్లు సంబంధిత బ్యాంకుల కు ఫిర్యాదు చేసి.. తమ డబ్బును వెనక్కి పం పాల్సిందిగా విజ్ఞప్తి చేస్తారు. రాజస్థాన్ నుంచి యూపీఐ ద్వారా హైదరాబాద్‌లోని షోరూంలకు చెల్లింపులు జరగడంతో పొరపాటు జరిగి ఉండవచ్చని సదరు బ్యాంక్‌లు యూపీఐ ద్వారా జరిగిన చెల్లింపులను వెనక్కి రప్పిస్తాయి.ఈ విధంగా రాజస్థాన్ ముఠా సభ్యులు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. ఈ తరహా మోసాలు జరుగుతున్నట్లు తరచూ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని పలు ఠాణాల్లో కేసులు నమోదవుతున్నాయి. బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ సీసీఎస్ పోలీసులు, కేపీహెచ్‌బీ, మాదాపూర్, నార్సిం గి పోలీసులు కలిసి సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి.. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# నీటి పారుదల పై ఉత్త మాటలే

**భువనగిరి-నవభూమి :** భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నీటిపారుదల పురోగతి పనులపై ఆగస్టు 30న భువనగిరిలో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్, హెలిప్యాడ్ ఉన్నప్పటికీ వృథా ఖర్చుతో న్యూడైమెన్షన్ స్కూల్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దీనికి రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. వీరితోపాటు రైతులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలో నీటిపారుదల శాఖ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ పరిధిలోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లతోపాటు బునాదిగాని, ధర్మారెడ్డి పల్లి, పిలాయిపల్లి కాల్వల గురించి ప్రస్తావించారు. నీటిపారుదల శాఖ అధికారులు కూడా ఆయా ప్రాజెక్టులపై ప్రతిపాదనలు పంపించారు. కానీ ఏ ఒక్కటీ అడుగు ముందుకు పడలేదు. అందరి నమ్మకాలన్నీ వమ్ము అయ్యాయి.

